క్లుప్తంగా

నేడు బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

కొరిటిపాడు: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని గ్రామీణ వాతావరణంలో నిర్వహించనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో వేంచేసిఉన్న పెద్దేటమ్మ ఆలయం వద్ద బుధవారం ఉగాది పర్వదిన సందర్భంగా పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ప్రవచనాచార్య డాక్టర్ నందవనం శ్రీనివాసరావు ప్రసంగకర్తగా హాజవుతారని తెలిపారు.

వేంకటేశ్వరాలయంలో ఉగాది ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, స్వామి కల్యాణం, పంచాంగ శ్రవణం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు తెలిపారు. మంగళవారం ఆలయంలో స్వామి కల్యాణంలో భాగంగా ముందస్తు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ ఉదయం 5 గంటలకు స్వామివారికి ముత్యాల అలంకరణ, 9 గంటలకు లలితాపారాయణం జరుగుతుందన్నారు. 11 గంటలకు పంచాంగ శ్రవణం జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు కోలాట భజన, స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం స్వామి తీర్థ ప్రసాదం అందజేస్తారన్నారు. కావున భక్తులు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

రాహుకేతువుకు ప్రత్యేక పూజలు

ఆలయానికి రూ. 4,35,000ల ఆదాయం



పెదకాకాని: శివాలయంలో రాహుకేతువు గ్రహ పూజలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మంగళవారం అమావాస్య రాహుకేతు గ్రహ పూజలకు విశేషమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాహుకేతువు మండపం నందు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పందిళ్లు, క్యూ లైన్లు, తాగునీరు ఏర్పాటు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. వేకువ జామున 5 గంటల నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. గ్రహ దోషాలు తొలగిపోయేందుకు నిర్వహిస్తున్న ఈ పూజలు పెదకాకాని శివాలయంలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఒక్క రోజులో ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చి 869 మంది పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి రాహుకేతువు పూజల ద్వారా రూ.4,35,000ల ఆదాయం చేకూరిందని ఏసీ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

దాతల సహకారం అభినందనీయం



పెదకాకాని: విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న పోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం జీఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం సిబార్ దంత వైద్య కళాశాల యాజమాన్యం ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేసింది. గత పదేళ్లుగా ఉత్తమ ప్రతిభ చూపుతున్న తరగతికి ఇద్దరు విద్యార్థుల చొప్పున నగదు బహుమతులు అందజేస్తున్నామన్నారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిభా పోత్సాహక బహుమతులు అందించడం ద్వారా విద్యార్థుల్లో మరింత పోటీతత్వం పెరుగుతుందన్నారు. అనంతరం 16 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబార్ పిల్లల దంత వైద్య నిపుణులు డాక్టర్ సాయిశంకర్, సిబ్బంది చెరుకూరి రమేష్ బాబు, గోపాలకృష్ణ, స్థానిక పెద్దలు కగ్గా శివ, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందజేత

గుంటూరు మెడికల్: గుంటూరు నగరానికి చెందిన పేద క్రీడాకారుడు షేక్ అబ్దుల్ మతిన్‌ను మంగళవారం గుంటూరుకు చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అభినందించారు. జమ్మూకశ్మీర్‌లో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటి మే1న కేరళలో జరిగే ఆసియా ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 74 కిలోల సబ్‌జూనియర్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో డాక్టర్ వెంకటేశ్వర్లు పవర్‌లిఫ్టర్ మతిన్‌ను సన్మానించి, రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. మతిన్ తండ్రి షేక్ బాకర్ హుస్సేన్ చిరుద్యోగి.

రాగి జావతో.. విద్యార్థులకు ఆరోగ్యం



రాగి జావ అందజేస్తున్న జెడ్పీటీసీ తుమ్మల



రాగిజావ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ కల్లూరి అన్నపూర్ణ



విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న జెడ్పీటీసీ గుల్జార్

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు రాగిజావ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. బలవర్థక ఆహారాన్ని అందించేందుకు రాగి జావ పంపిణీ కార్యక్రమం చేపట్టటం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, సుధాకర్, వంగా నవీన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. వెంగళాయపాలెం గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ జెడ్పీటీసీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, వెంకటరావు పాల్గొన్నారు.

రాగి జావ పంపిణీ

పెదనందిపాడు: ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు కల్లూరి అన్నపూర్ణ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మండల పరిధిలోని కేఎస్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కల్లూరి అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎ. శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు కల్లూరి నాగేశ్వరరావు, హెచ్ఎం సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

కాకుమాను: ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యమని కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని కాకుమాను, కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రాగి జావను మంగళవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో రాణిస్తారనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి శివ కుమారి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, చిన లింగాయపాలెం ఎంపీటీసీ జూపూడి ఏసోబు, హెచ్ఎం టి.జోష్ మేరి, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ వసంత, డాక్టర్ అసదుల్లా, మాణిక్యరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొప్పురావూరులో..

పెదకాకాని: రాగి జావను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. కొప్పురావూరు జడ్పీస్కూల్‌లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. కొప్పురావూరు, వెనిగండ్ల, పెదకాకాని, తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు అతిథులు రాగి జావ అందజేశారు. పెదకాకాని బాజీబాబా దర్గా స్కూల్‌లో గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, స్థానిక వార్డు మెంబర్ షేక్ సర్తాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంఈఓ డి.బలిరాం, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులు కోర్కెలు తీర్చే చల్లని తల్లి పోలేరమ్మ

మేయర్ కావటి మనోహర్‌నాయుడు



పూజలో మేయర్ మనోహర్‌నాయుడు, వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే గ్రామ దేవత పోలేరమ్మ తల్లి అని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. మంగళవారం గోరంట్ల గ్రామంలోని శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మేయర్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ దేవతల్లో శ్రీ పోలేరమ్మతల్లి శక్తి వంతమైన దేవతని ఆమె కరుణ, కటాక్షాలు గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ మాట్లాడుతూ దైవ చింతనతో మనిషి మానశిక ప్రశాంతత పొందుతాడన్నారు. గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ చేస్తున్న సేవలు అభినందించారు. ప్రతి ఒక్కరూ తమకు అందుబాటులో ఉన్న దేవాలయాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదం మహాన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, స్థానిక కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మ, దాసరి లక్ష్మీదుర్గ, యర్రంశెట్టి సూరి, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి



పంచాయతీ కార్యదర్శులతో డీపీఓ ఆర్.కేశవరెడ్డి

చేబ్రోలు: ఈ నెలాఖరులోగా నూరు శాతం ఇంటి పన్ను, నీటి పన్ను తప్పనిసరిగా వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో మంగళవారం తెనాలి డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దుగ్గిరాల, మంగళగిరి, తెనాలి, కాకుమాను, చేబ్రోలు, పొన్నూరు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులను గ్రామాల వారీగా పన్ను వసూలు, బకాయిలపై సమీక్షించారు. వసూలు చేయటంలో అలసత్వం వహిస్తున్నవారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. చేబ్రోలు పంచాయతీ పరిధిలో 70శాతం కూడా వసూలు కాకపోవటంపై పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. జయలక్ష్మి స్పిన్నింగ్ మిల్లు నుంచి రూ.16లక్షలు, తదితర పరిశ్రమల నుంచి పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు చెల్లింపులు జరగటం లేదని తెలియజేశారు. ఎట్టి పరిస్థితుల్లోను వంద శాతం పన్ను బకాయిలు వసూలు చేయాలని డీపీఓ హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

రిటైర్డ్ కలెక్టర్ శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్



మాట్లాడుతున్న శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్

గుంటూరు రూరల్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ప్రతి విద్యార్థి లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని రిటైర్డ్ కలెక్టర్ శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్ తెలిపారు. మంగళవారం 27వ డివిజన్ నల్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదర్శనం లివింగ్‌స్టన్ గద్దె చారిటుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల అభివృద్ధికి కృషిచేస్తున్న ట్రస్ట్ సభ్యులను అభినందించారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ బెంజిమన్ శ్యామ్యూల్, స్థానిక కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటిని కాపాడుకుంటేనే భవిష్యత్తు

సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.శ్రీధర్



విజ్ఞాన్ వర్శిటీలో డాక్టర్ ఎస్.శ్రీధర్

చేబ్రోలు: భూగర్భ జలాలను పది కాలాల పాటు కాపాడుకుంటేనే మానవ జాతికి భవిష్యత్తు ఉంటుందని హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.శ్రీధర్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం వరల్డ్ వాటర్ డే సందర్భంగా ''వాటర్ ప్యూరిఫి కేషన్ అండ్ వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ త్రూ ఇన్నోవేటివ్ సైన్స్ అండ్ టెక్నాలజీ'' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదిత జలానికి ప్రత్యామ్నాయం లేదన్నారు. అమూల్యమైన సహజ వనరును పరిరక్షించుకుంటూ పొదుపుగా, సమర్థంగా వాడుకుంటేనే జల సంక్షోభాలను ఎదుర్కోగలమన్నారు. వర్షాలు తగ్గిపోవడం వల్ల భూగర్భ జలాలపై ఒత్తిడి అధికమై తాగునీటికి కటకట ఏర్పడుతోందన్నారు. ప్రస్తుత నీటి లభ్యత, వర్షపాతాల పరిస్థితులనుబట్టి చూస్తే భవిష్యత్‌లో తీవ్ర కొరత ఎదురు కావడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. పట్టణాలు, నగరాల్లో వర్షం నీటిని నిల్వచేసే భూగర్భ ట్యాంకుల నిర్మాణం తప్పనిసరి చేయాలన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వివిధ విభాగాల డీన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

కొరిటిపాడు: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని గ్రామీణ వాతావరణంలో నిర్వహించనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో వేంచేసిఉన్న పెద్దేటమ్మ ఆలయం వద్ద బుధవారం ఉగాది పర్వదిన సందర్భంగా పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు.

యాజమాన్య పద్ధతులతో నష్ట నివారణ

లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం

గుంటూరు రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు పంటల్లో తగిన యాజమాన్య పద్ధతులు చేపట్టి..నష్ట నివారణను తగ్గించుకోవాలని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన ఐదు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సాధారణంగా 0.14 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా అల్పపీడనాల వల్ల 7.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైందన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో సాధారణం కన్నా అధికంగా వర్షపాతం నమోదైందన్నారు. అన్ని జిల్లాల్లో కొంతమేర నష్టం వాటిల్లిందన్నారు. అదేవిధంగా మినుము, పెసర, పత్తి, జొన్న, నువ్వులు, కొర్ర, ఆముదము, ప్రొద్దుతిరుగుడు, కుసుమలు, పొగాకు, వేరుశనగ, కంది, సజ్జ ఉలవలు పంటలపై వర్షాలు ప్రతికూల వాతావరణాన్ని చూపాయన్నారు. రైతులు ముందస్తు సూచనలు అనుసరిస్తూ పంటల వారీగా తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

కాకుమాను: పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ ఏడాది పది పరీక్షల్లో మండలంలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.25 వేలు, ఆరు పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ఇస్తానని చెప్పారు. హెచ్ఎం టి.జోష్ మేరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కారు స్పేర్‌పార్ట్స్ మాయంపై ఫిర్యాదు..

పెదకాకాని: పెయింటింగ్ కోసం కారును షోరూంలో ఇస్తే.. అందులోని పార్ట్స్ మాయం చేశారని యజమాని మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన గుంటూరు ఆటో నగర్‌లోని ఓ షోరూంలో చోటు చేసుకుంది. ఈ మేరకు.. కంపెనీ యాజమాన్యం, డీలర్‌పై చర్యలు తీసుకోవాలని పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఎన్.తిరుపతయ్య అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన తిరుపతయ్య ఐదు నెలల క్రితం ఆటో నగర్‌లోని ఓ షో రూంలో కారును కొనుగోలు చేశారు. ఈ నెల 12న చిన్న ప్రమాదం కారణంగా గీతలు"పడటంతో.. 13న పెయింట్ వేసేందుకు సదరు కంపెనీ సర్వీస్ షోరూంలో ఇచ్చాడు. నాలుగు రోజుల్లో మరమ్మతులు చేసి ఇస్తామని చెప్పి.. 9 రోజులు గడుస్తున్నా కారు ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి మంగళవారం షోరూంకు వెళ్లి చూశాడు. అప్పటికే కారుకు సంబంధించిన కొన్ని విడిబాగాలు కనిపించలేదని, సర్వీసు సెంటర్ యజమాన్యం, మేనేజర్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోగా దౌర్జన్యానికి బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కారు మిర్రర్‌ను పొరపాటున మరొక కారుకు అమర్చినట్లు ఒప్పుకున్నారని ఫిర్యాదులో తెలిపారు. తొలగించిన వ్యక్తిపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంపెనీపై, సర్వీస్ సెంటర్ డీలర్‌పైనా చర్యలు తీసుకోవాలని కారు యజమాని పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఆర్జీవి, వర్సిటీ వీసీపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు



సీఐ సురేష్‌బాబుకు ఫిర్యాదు అందజేస్తున్న మహిళా న్యాయవాదులు

పెదకాకాని: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ, వర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌పై గుంటూరు బార్ కౌన్సిల్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులు పెదకాకాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అకడమిక్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో రాంగోపాల్ వర్మ మహిళలను కించపరచేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ లక్ష్మీ సుజాత మాట్లాడారు. రాంగోపాల్ వర్మ మాటలు మహిళా అధ్యాపకులు తలదించుకునేలా ఉన్నాయన్నారు. మహిళల్ని అవమానపరచే విధంగా రాంగోపాల్ వర్మ మాట్లాడితే వీసీ చప్పట్లు కొడుతూ సమర్థించడం సరికాదన్నారు. ఆయన దృష్టిలో మహిళ విలాస వస్తువా అంటూ ప్రశ్నించారు. సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేయించాలని ఇప్పటికే ఏపీ, తెలంగాణ మహిళా కమిషన్‌లను కలసి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన రాంగోపాల్ వర్మ, ఆయనను వర్సిటీకి ఆహ్వానించిన వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌లపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐ బండారు సురేష్ బాబుకు ఫిర్యాదు అందజేశారు. దీనిపై సీఐ మాట్లాడుతూ గుంటూరు బార్ కౌన్సిల్ మహిళా న్యాయవాదులు అందజేసిన ఫిర్యాదుపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయవాదులు వరలక్ష్మి, చారులత, పద్మవల్లి తదితరులు ఉన్నారు.

బాలుడిపై లైంగిక దాడి

పెదకాకాని: ఆరో తరగతి చదువుతున్న బాలుడిపై.. ఇద్దరు మైనర్లు లైంగిక దాడికి పాల్పడ్డారు. అదంతా వీడియో తీశారు. తాము చేసిన ఘనకార్యాన్ని ఇతరులకు వాట్సాప్‌లో షేర్ చేశారు. బయటకు చెబితే..చంపేస్తామని ఆ బాలుడిని కత్తితో బెదిరించారు. చివరకి ఆ బాలుడి తండ్రికి వీడియో చేరడంతో.. జరిగినది తెలుసుకుని పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పెదకాకాని పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన పండ్ల వ్యాపారి..వ్యాపారం నిమిత్తం.. వారంలో ఒక రోజు ఇంటికి వచ్చి తిరిగి వెళ్తూ ఉంటాడు. అతని కుమారుడు ఆరో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 19న అదే కాలనీకి చెందిన మరో ఇద్దరు(ఒకరికి 16, మరొకరికి 17ఏళ్లు) వారిలో ఒకరి ఇంటికి బాలుడిని తీసుకెళ్లారు. బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికైనా చెప్తే..చంపేస్తామని కత్తితో బెదిరించారు. ఈ ఘటనను వీడియో తీసి, వాట్సాప్‌లో షేర్ చేశారు. ఈ 20న తెనాలి నుంచి ఇంటికి వచ్చిన బాలుడి తండ్రి.. ఇంటి పక్కనే ఉన్న అమర్‌నాథ్ అనే వ్యక్తి తన ఫోన్‌కు వచ్చిన వీడియో చూపించడంతో షాక్‌కు గురయ్యాడు. కుమారుడిని వెంట పెట్టుకుని పెదకాకాని పోలీసులను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదు మేరకు.. సోమవారం రాత్రి ఇరువురు మైనర్ల పోక్సో, లైంగిక దాడి, కత్తితో బెదిరించడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

బాజీబాబా దర్గాలో అన్న సంతర్పణ



అన్నదానం చేస్తున్న వక్ఫ్‌బోర్డు ఈఓ షేక్ ముక్తార్ బాషా

పెదకాకాని: బాజీబాబా దర్గాలో భక్తులందరికీ అన్న సంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మంగళవారం రాత్రి దర్గా ప్రాంగణంలో భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది. బాజీబాబా దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుబాని, దర్గా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అలానే సమీపంలోని అమ్మ జానమ్మ దర్గా వద్ద మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్ అన్న సంతర్పణ చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

నకిలీ పోలీసులపై కేసు నమోదు

పెదకాకాని: పోలీసులమని చెప్పి గుట్కాలు అమ్ముతున్న వారిని బెదిరించి.. డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన నలగాపుల శ్రీనివాసరావు, రాజులపాటి నాగరాజు ఇళ్లకు సీలింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే దురాశతో మంగళవారం రాత్రి మండలంలోని నంబూరు చేరుకున్నారు. గుట్కా అమ్ముతున్నారని బెదిరించి, షాపు నిర్వాహకుడు షేక్ అలీ వద్ద రూ.3 వేలు నగదు వసూలు చేశారు. అలానే మరో షాపు వద్ద కూడా వసూలు చేసే ప్రయత్నం చేస్తుండగా అనుమానం వచ్చి దుకాణదారుడు నిలదీశారు. పారిపోయేందుకు ప్రయత్నించగా దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

పెదకాకాని: ఆహారంలో చిరు ధాన్యాలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్యవతి అన్నారు. శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకూ పోషన్ పక్వాడా పక్షోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో బాగంగా మంగళవారం పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలు ఆహారంతో పాటు తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏఎన్ఎం బి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.